

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



సెప్టెంబర్ 22 మంగళవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 229 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

TUESDAY SEPTEMBER 22 2026 | VOL:18 | ISSUE: 229 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే

సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి

మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన

శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన

ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది.సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు.అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు.సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు. ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి





అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?: రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్ చేశారన్న కేటీఆర్

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం

బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారని ఆరోపణ

సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ

అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, నీళ్లు ఇవ్వాలని డిమాండ్

ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాల్సింది పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా

(మిగతా 2వ పేజీలో..)



బంగాళాఖాతంలో రేపటికి వాయుగుండం.. ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు


బంగాళాఖాతంలో అల్పపీడనం, రేపటికి వాయుగుండంగా బలపడే అవకాశం

రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

పలు కోస్తాంధ్ర జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన

(మిగతా 2వ పేజీలో..)



లండన్ కాదు.. కోయంబత్తూరు, మధురైకి వెళ్లండి: సీఎం విజయ్‌కు అన్నామలై సూచన

తమిళనాడు సీఎం విజయ్ లండన్ పర్యటనపై అన్నామలై విమర్శలు

బ్రిటన్‌ను చచ్చిపోయిన ఆర్థిక వ్యవస్థగా అభివర్ణించిన అన్నామలై

విదేశాల బదులు రాష్ట్రంలోని పారిశ్రామిక నగరాల్లో పర్యటించాలని సూచన

భారత్ కంటే యూకే ఆర్థిక వ్యవస్థ బలమైనదని వ్యాఖ్య

స్థానిక వ్యాపారులకు పన్ను మినహాయింపులు ఇవ్వాలని ప్రభుత్వానికి హితవు

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్



ఇటీవల లండన్‌లో పర్యటించడంపై రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై తీవ్ర విమర్శలు చేశారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)ను 'చచ్చిపోయిన ఆర్థిక వ్యవస్థ'గా అభివర్ణించిన ఆయన, విదేశాల నుంచి కాకుండా రాష్ట్రం నుంచే పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.మధురైలో మీడియాతో మాట్లాడిన అన్నామలై.. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ విలువ సుమారు 4.1 ట్రిలియన్ డాలర్లు కాగా, యూకే ఆర్థిక వ్యవస్థ కేవలం 3.4 ట్రిలియన్ డాలర్లు మాత్రమేనని

(మిగతా 2వ పేజీలో..)

పోఖ్రాన్ ఆంక్షల తర్వాత మళ్లీ.. భారత్‌పై అమెరికా సుంకాల కత్తి

రష్యా చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అమెరికా కొత్త చట్టం

25 ఏళ్ల క్రితం నాటి పోఖ్రాన్ ఆంక్షల తరహా పరిస్థితులు పునరావృతం అవుతాయనే ఆందోళన

దేశ ఇంధన భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేసిన భారత ప్రభుత్వం

భారత్–అమెరికా వ్యూహాత్మక, వాణిజ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి అధిక మొత్తంలో ముడి చమురు, సహజ వాయువు దిగుమతి చేసుకునే దేశాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పించే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

(మిగతా 2వ పేజీలో..)



రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్... శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన

ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామన్న మంత్రి పొంగులేటి

గత ప్రభుత్వం పేదలను నిర్లక్ష్యం చేసిందని విమర్శ

ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలో స్పష్టతనిచ్చిన ప్రభుత్వం

నెల రోజుల్లో అన్నిచోట్లా పనులు మొదలని ప్రకటన

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మల్కంచెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్స్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల కేటాయింపు పత్రాలను



పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందేవరకు ఈ పథకం దశలవారీగా నిరంతరాయంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లను నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు.

(మిగతా 2వ పేజీలో..)



విజయకేరళం
తెలుగు దినపత్రిక

సం పా దకీయం

రష్యా చమురుపై అమెరికా కొత్త ఆంక్షలు

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అదనంగా 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం కల్పించే కొత్త చట్టానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపారు. దీంతో రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.రష్యా చమురు కొనుగోళ్లను కొనసాగిస్తే అమెరికా అదనపు సుంకాలు విధించే అవకాశం ఉండటంతో భారత్‌కు ఇంధన దిగుమతుల విషయంలో కొత్త సవాళ్లు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గిస్తే ప్రత్యామ్నాయ దేశాల నుంచి అధిక ధరలకు చమురు కొనుగోలు చేయాల్సి రావచ్చు.దీంతో అంతర్జాతీయ చమురు ధరలు, రవాణా ఖర్చులు, రూపాయి మారకం విలువ వంటి అంశాలపై ఆధారపడి దేశీయ ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం, రవాణా వ్యయాలపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా మార్కెట్‌పై ఆధారపడే భారత ఎగుమతులపైనా అదనపు సుంకాల ప్రభావం ఉండొచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే భారత్‌పై 100 శాతం సుంకం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు కాదు. ఏ దేశాలపై, ఎంత మేర సుంకాలు విధించాలనే విషయంలో అమెరికా అధ్యక్షుడి తదుపరి నిర్ణయం కీలకం కానుంది

లండన్ కాదు.. కోయంబత్తూరు, మధురైకి వెళ్లండి: సీఎం విజయ్‌కు అన్నామలై సూచన

మొదటి పేజీ తరువాయి)

గుర్తుచేశారు. కేవలం 1 శాతం వృద్ధి రేటుతో నెమ్మదిగా సాగుతున్న దేశానికి పెద్ద ప్రతినిధి బృందంతో వెళ్లడం వల్ల ప్రయోజనం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ అక్కడి నుంచి పెట్టుబడులు వచ్చినా, అవి ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న భారతీయ కంపెనీల అనుబంధ సంస్థల నుంచే వస్తాయని, కొత్తగా విదేశీ మూలధనం రాదని అభిప్రాయపడ్డారు.విదేశీ పర్యటనలకు బదులుగా, ముఖ్యమంత్రి రాష్ట్రంలోని పారిశ్రామిక కేంద్రాలైన కోయంబత్తూరు, మధురై, తూత్తుకుడి వంటి ప్రాంతాల్లో పర్యటించాలని అన్నామలై సలహా ఇచ్చారు. స్థానిక వ్యాపారవేత్తలతో సమావేశమై, వారి వ్యాపార విస్తరణకు పన్ను మినహాయింపులు వంటి ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అలాగే, దేశంలోని ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రధాన నగరాల నుంచి కూడా పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.సీఎం విజయ్ ఆరు రోజుల యూకే పర్యటన ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 10,000కు పైగా ఉద్యోగాలు లభించాయని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అన్నామలై ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి పనిచేయడానికి కొంత సమయం ఇవ్వాలని చెబుతూనే, స్థానిక పరిశ్రమల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు.

పోఖ్రాన్ ఆంక్షల తర్వాత మళ్లీ.. భారత్‌పై అమెరికా సుంకాల కత్తి

మొదటి పేజీ తరువాయి)

సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం నిబంధనలు పాటించని దేశాల నుంచి వచ్చే వస్తువులపై 100శాతం వరకు భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లభిస్తుంది. ఈ పరిణామం రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహం పేరు మీద "లిండ్సే ఒ. గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026" పేరుతో ఈ చట్టాన్ని రూపొందించారు. అమెరికా సెనేట్, ప్రతినిధుల సభలో ఈ బిల్లుకు డెమొక్రాట్లు, రిపబ్లికన్లు అనే తేడా లేకుండా ఉభయపక్షాల మద్దతు లభించింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన 30 రోజుల్లోగా రష్యా నుంచి ముడి చమురు లేదా గ్యాస్ కొనుగోలు చేస్తున్న మొదటి ఐదు దేశాలలో ఒకటిగా ఉండి, తమ దిగుమతులను తగ్గించుకోని పక్షంలో ఆ దేశంపై సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి అధికారం ఉంటుంది.గత కొన్నేళ్లుగా భారత్, రష్యా నుంచి చౌక ధరలకు లభించే ముడి చమురును భారీగా కొనుగోలు చేస్తోంది. కొన్ని నెలల్లో అయితే, భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో సగానికి పైగా రష్యా నుంచే రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో అమెరికా తాజా చట్టం భారత్‌ను నేరుగా లక్ష్యం చేసే ప్రమాదం ఉంది.ఈ పరిణామంపై భారత అధికారులు స్పందిస్తూ, దేశ ప్రజల ఇంధన భద్రతకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. మార్కెట్‌లో లభ్యత, అందుబాటు ధర, ఇతర పరిస్థితులను బట్టే చమురు కొనుగోళ్లపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. అయితే, ఈ కొత్త చట్టం వల్ల ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం పడే అవకాశం ఉందని భారత విదేశాంగ శాఖ అభిప్రాయపడింది. దాదాపు 25 ఏళ్ల క్రితం 1998లో భారత్ నిర్వహించిన పోఖ్రాన్-xx అణు పరీక్షల అనంతరం అప్పటి అమెరికా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. ఆ తర్వాత జార్జ్ డబ్ల్యూ. బుష్ హయాంలో ఆ ఆంక్షలను ఎత్తివేశారు. ఇప్పుడు మళ్లీ ఇన్నేళ్ల తర్వాత అమెరికా నుంచి ఇలాంటి కఠినమైన వాణిజ్యపరమైన చర్యల ముప్పు పొంచి ఉండటం వ్యూహాత్మక, వాణిజ్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కొత్త చట్టం ఇరు దేశాల మధ్య నెలకొన్న బలమైన భాగస్వామ్యానికి కొత్త పరీక్షగా నిలవనుంది.

రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?: రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్... శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి


మొదటి పేజీ తరువాయి)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. నగరానికి దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే, తమ ప్రభుత్వం అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు గృహవసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విచారణలో అనర్హులుగా తేలిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తామని, బేస్‌మెంట్ పూర్తి చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అయితే, ఇళ్లు మంజూరై ఉండి, ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని అనర్హుల కేటాయింపులను రద్దు చేస్తామని, ఆ స్థానంలో అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

బంగాళాఖాతంలో రేపటికి వాయుగుండం.. ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

లోతట్టు ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం మంగళవారానికి వాయుగుండంగా బలపడనుందని, దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, మంగళవారం (సెప్టెంబర్ 22) నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది.బుధవారం (సెప్టెంబర్ 23) నాటికి వర్షాల ప్రభావం మరింత పెరగనుంది. అల్లూరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో సైతం కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది. ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అందువల్ల మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వేటకు వెళ్లరాదని స్పష్టంగా సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



విజయ కెరటం
తెలుగు దినపత్రిక
సెప్టెంబర్ | మంగళవారం | 22 | 2026

క్రిస్టియన్ మైనారిటీ యువతకు ఉచిత శిక్షణ

నల్గొండ సెప్టెంబర్ 21 ప్రతినిధి

నల్లగొండ జిల్లాలో క్రిస్టియన్ మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచితంగా Graphic Design with AI Tool కోర్సులో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. 2026-27 సంవత్సరానికి అర్హులైన క్రిస్టియన్ మైనారిటీ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.అభ్యర్థులు క్రిస్టియన్ మైనారిటీ BC-C సర్టిఫికెట్ లేదా బాప్టిజం సర్టిఫికెట్, ఆధార్ కార్డు కలిగి ఉండాలి. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. పట్టణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలలోపు ఉండాలి. ఆదాయ ధ్రువీకరణ పత్రం మీ సేవా ద్వారా జారీ చేసినదై ఉండాలి. కోర్సుకు అవసరమైన విద్యార్హతగా ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. గతంలో ప్రభుత్వం ద్వారా ఏదైనా వృత్తి విద్యలో శిక్షణ పొందిన వారు అనర్హులు.అర్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో సెప్టెంబర్ 25, 2026లోపు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం లేదా Softech Educational Society, శివాజీనగర్ డౌన్, SBI బ్యాంక్ పైన కార్యాలయ వేళల్లో దరఖాస్తులు సమర్పించాలి.మరిన్ని వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం నల్గొండను లేదా 9440727085 నంబర్‌ను సంప్రదించాలని



జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి. విజయేందర్ రెడ్డి తెలిపారు.

ప్రజావాణిలో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. జిల్లా కలెక్టర్







నల్లగొండ సెప్టెంబర్ 21 విజయకేరటం ప్రతినిధి

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం పై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు . ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షిస్తూ ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని, ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కారం అయితే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులో భాగంగా జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్ ,మండల కేంద్రాలలో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని స్థాయిల్లో ఫిర్యాదుల పరిష్కారాన్ని ప్రత్యేక అంశంగా పరిగణించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించిన ఫిర్యాదుల విషయాన్ని ఫిర్యాదుదారుకు తెలియజేయాలని, ఒకవేళ ఏదైనా కారణం చేత పరిష్కారం కానట్లయితే ఎందుకు పరిష్కారం కాలేదో కూడా తెలియజేయాలన్నారు .వచ్చిన ఫిర్యాదులన్నింటిని ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు.ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 54, ఇతర శాఖలకు 75,మొత్తం 125 ఫిర్యాదులు వచ్చాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులు తొమ్మిదవ రాష్ట్రీయ పోషణ మహా పై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిఆర్ఓ దశరథ, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

TNGOs MACH Society Ltd., Gachibowli డైరెక్టర్

ఎన్నికల్లో TNGOs యూనియన్ అధికారిక ప్యానెల్ ఘన విజయం

హైదరాబాద్: సెప్టెంబర్ 21 విజయ కెరటం ప్రతినిధి

TNGOs MACH Society Ltd., Gachibowliలో ఖాళీ అయిన రెండు డైరెక్టర్ పదవులకు నిన్న జరిగిన ఎన్నికల్లో TNGOs యూనియన్ అధికారిక ప్యానెల్ అభ్యర్థులు శ్రీ కారం రవీందర్ రెడ్డి మరియు శ్రీ కట్కూరి శ్రీకాంత్ విజయం సాధించారు. మొత్తం 2,107 మంది సభ్యులకు గాను 867 మంది ఓటు హక్కును వినియోగించుకోగా,



7 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి.

శ్రీ కారం రవీందర్ రెడ్డి -- 583 ఓట్లు


శ్రీ కట్కూరి శ్రీకాంత్ -- 302 ఓట్లు

ఎన్నికల అధికారి శ్రీ మోహన్ రావు గారు ఇరువురిని విజేతలుగా అధికారికంగా ప్రకటించారు.ఎన్నికల సందర్భంగా శ్రీమతి ఉమాదేవి, శ్రీ గోవర్ధన్ రెడ్డి గారు ఎ+ూం యూనియన్ అధికారిక ప్యానెల్‌కు మద్దతుగా తమ అభ్యర్థిత్వాన్ని విరమించుకోవడం విశేషం.ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను శ్రీ కె. స్వామిగౌడ్, శ్రీ సుధాకర్, శ్రీ దేవిప్రసాదరావు, శ్రీ మీమిళ్ల రాజేందర్, శ్రీ మారం జగదీశ్వర్, శ్రీ ముజీబ్, శ్రీ ఎం.ఏ. హమీద్ తదితరులు అభినందించారు. సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ



భద్రకాళి నగర్‌లో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు

హనుమకొండ సెప్టెంబర్ 21 విజయ కెరటం ప్రతినిధి



భీమారం 55వ డివిజన్ భద్రకాళి నగర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు అల్లేపు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కుమారి నగునూరి పరిణయ శ్రీతి, సాయి శ్రీతి, ముత్యాల చిద్రు తదితరులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలు చేసి కాలనీ వాసుల ప్రశంసలు అందుకున్నారు.అనంతరం సందీప్, వేణు మిత్ర బృందం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా సుమారు 500 మంది పాల్గొన్నారు. సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, కాలనీ మహిళలు వివిధ రకాల కూరగాయలతో గణనాథుని అలంకరించారు. శ్రీ నాగిళ్ల వేణు శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విగ్రహ దాత శ్రీనివాసరెడ్డి దంపతులతో పాటు కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఆదివారం ఎంజీఎంలో స్లాబ్ పెచ్చులు.. సోమవారం అధికారుల తనిఖీ

ముగ్గురికి గాయాలు.. రోగుల భద్రతపై కలెక్టర్ ఆరా

వరంగల్, విజయ కెరటం సెప్టెంబర్ 21:



వరంగల్ ఎంజీఎం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం ఆరోగ్యశ్రీ వార్డులో స్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో ముగ్గురు గాయపడిన ఘటనపై అధికారులు సోమవారం స్పందించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, డీఎంఈ డాక్టర్ వాణి ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.స్లాబ్ పెచ్చులు ఊడిపడిన ఆరోగ్యశ్రీ వార్డును అధికారులు స్వయంగా పరిశీలించి, ఘటనకు సంబంధించిన వివరాలను ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని పలు వార్డులు, ఓపీ విభాగాన్ని పరిశీలించారు. రోగుల భద్రత, ఆస్పత్రి భవనాల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు.వైద్యం కోసం వచ్చిన రోగులు, వారి సహాయకులు ఉన్న వార్డులో స్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో ఆస్పత్రి భవనాల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాత భవనాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారా? ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపడుతున్నారా? అనే అంశాలు చర్చనీయాంశంగా మారాయి.గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఆస్పత్రిలో ప్రమాదకర పరిస్థితులు ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్, డీఎంఈ అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఎస్సీ సెల్ బలోపేతానికి కాంగ్రెస్ కసరత్తు

వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా అర్షం అశోక్ నియామకం

వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 21 :



కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు టీపీసీసీ ఎస్సీ సెల్ చర్యలు చేపట్టింది. జాతీయ ఎస్సీ విభాగం చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్ సూచనల మేరకు గ్రామ, మండల స్థాయిలో ఎస్సీ సెల్ కమిటీల ఏర్పాటును వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జిల్లాల వారీగా ఇన్‌చార్జిలు, కోఆర్డినేటర్లను నియమించారు.వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ ఇన్‌చార్జిగా టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్షం అశోక్‌ను నియమించారు. ఆయనకు సహకరించేందుకు అనుగంటి హరీష్, పిడుగు మమతలను కోఆర్డినేటర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో గ్రామ, మండల స్థాయి కమిటీల ఏర్పాటు, సమన్వయం, పర్యవేక్షణ బాధ్యతలను వీరు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా అర్షం అశోక్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయి కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి ఎస్సీ వర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ క్రియాశీలకంగా పనిచేసే వారికి కమిటీల్లో ప్రాధాన్యం కల్పిస్తామని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించి వాటిపై పోరాటం చేయడమే కమిటీల ఏర్పాటులో ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేసి ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా పనిచేసేలా ఎస్సీ సెల్‌ను పటిష్టం చేస్తామని అర్షం అశోక్ పేర్కొన్నారు.

వరంగల్ విమానాశ్రయానికి పీవీ పేరు పెట్టాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజనాల శ్రీహరి విజ్ఞప్తి

వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 21:



వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుకు మాజీ ప్రధాని, తెలంగాణ బిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావు (పీవీ) పేరు పెట్టాలని గ్రేటర్ వరంగల్ వర్కింగ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల శ్రీహరి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ప్రధానమంత్రిగా దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక సంస్కరణలకు పీవీ నరసింహారావు శ్రీకారం చుట్టారని, దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.తెలంగాణ నేల నుంచి దేశ ప్రధానమంత్రిగా ఎదిగిన పీవీ సేవలకు గుర్తింపుగా వరంగల్ విమానాశ్రయానికి 'శ్రీ పీవీ నరసింహారావు డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్'గా నామకరణం చేయడం సముచిత గౌరవమని అన్నారు. పీవీ పేరు పెట్టడం ద్వారా ఆయన సేవలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసినట్లవుతుందని తెలిపారు.వరంగల్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్ ప్రాంతంలో పారిశ్రామిక, వాణిజ్య, విద్య, వైద్యం, పర్యాటక రంగాల అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయని రాజనాల శ్రీహరి పేర్కొన్నారు. విమానాశ్రయం ఏర్పాటుతో హైదరాబాద్‌పై రవాణా ఆధారపడటం కొంత తగ్గడంతో పాటు వరంగల్ ప్రాంతానికి మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పీవీ నరసింహారావు పేరు పెట్టే అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలించాలని కోరారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

మిత్రుడి కుటుంబానికి సహాధ్యాయుల చేయూత

రూ.5 వేల నగదు, క్వింటా బియ్యం అందజేత



వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 21 :

రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందిన టెన్త్ క్లాస్ మిత్రుడు బేంబిరి సురేష్ కుటుంబానికి అతడి సహాధ్యాయులు అండగా నిలిచారు. ఖిలా వరంగల్ మండలం స్తంభంపల్లి గ్రామంలోని సురేష్ ఇంటికి వెళ్లిన మిత్రులు కుటుంబ సభ్యులను పరామర్శించి, సురేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు ఒక క్వింటా బియ్యం, రూ.5 వేల నగదు అందజేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలు కలిసి చదువుకున్న సురేష్ తమ మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమన్నారు. కష్టకాలంలో ఆయన కుటుంబానికి తమ వంతు అండగా నిలవాలనే ఉద్దేశంతో సహాయం అందించినట్లు తెలిపారు.కార్యక్రమంలో వినోద్, రవీందర్, జయాకర్, నరేష్, శివ, రాజేందర్, రాంబాబు, రాజేష్, అనిల్, రాజు, హరీష్, రమేష్, విజయ్, మహేష్, వెంకట్, మల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ లో బాధిత ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి ..

నల్లగొండ సెప్టెంబర్ 21 విజయకేరటం ప్రతినిధి



సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గారు జిల్లాలో వివిద పోలీస్ స్టేషన్ పరిదిలో నుంచి వచ్చిన దాదాపు 30 మంది బాధితులసమస్యలను, ఫిర్యాదులను విని సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ గారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ గారు, సంబంధిత పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో మాట్లాడి బాధితుల ఫిర్యాదుల విషయంలో ఎలాంటి జాప్యం చేయకుండా, వాస్తవాలను పూర్తిస్థాయిలో విచారించి అవసరమైన చోట కేసులు నమోదు చేయడం, దర్యాప్తు చేపట్టడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారంపై స్పష్టమైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజలు తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి తీసుకువచ్చినప్పుడు వాటిని బాధ్యతాయుతంగా స్వీకరించి, బాధితులకు అండగా నిలవాలని జిల్లా ఎస్పీ గారు అధికారులకు సూచించారు.

భీమ్ ఆర్మీ నూతన అధ్యక్షుడు గా వంగూరి శ్రీకాంత్ ఎన్నిక.

నలగొండ సెప్టెంబర్ 21 విజయ కెరటం ప్రతినిధి



నల్గొండ పట్టణ కేంద్రంలో భీమ్ ఆర్మీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమంలో నల్గొండ మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన వంగూరి శ్రీకాంత్ గారు భీమ్ ఆర్మీ నల్గొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికకావడం జరిగింది ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ భీమ్ ఆర్మీ నల్గొండ నియోజకవర్గ నిర్మాణం లో భాగంగా మహాత్మా జ్యోతి బాపులే, చత్రపతి షాహుజీ మహారాజ్, బాబాసాహెబ్, డా, భీమ్ రావు అంబేద్కర్ గారి మరియు మాన్యవార్ కాన్షీరామ్ గారి బహుజన హితాయ బహుజన సుఖాయ భావజాలాన్ని ప్రజల్లో కి తీసుకెళ్తానని తెలిపారు ఈ ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి నాగరాజు గారి కి అదేవిధంగా భీమ్ ఆర్మీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసరూ

బోయవాడలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

నల్గొండ: సెప్టెంబర్ 21 విజయ కెరటం ప్రతినిధి



పట్టణంలోని బోయవాడలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం వద్ద కార్పొరేటర్ అబ్బగోని కవిత రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆకట్టుకుంది.

భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి వేడుకలు









మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

లి45వ డివిజన్ లో గణేశుడి విగ్రహం వద్ద అన్న వితరణ

నల్లగొండ: సెప్టెంబర్ 21 విజయ కెరటం ప్రతినిధి

నల్గొండ పట్టణంలోని గణేష్ నవరాత్రి వేడుకలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటున్నారని నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారుసోమవారం నల్గొండ పట్టణంలోని 45 డివిజన్ న్యూ ప్రకాశం బజార్ లో గల గణేశుడి విగ్రహం వద్ద గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న వితరణ కార్యక్రమాన్ని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమేర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద భక్తుశద్ధలతో పూజలు నిర్వహిస్తూ అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో ఈ పండుగను జరుపుకుంటున్నారని తెలిపారు. గణేష్ నవరాత్రి వేడుకలు, నిమజ్జనానికి నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు కూడా చేయడం జరిగిందని తెలిపారు. నల్లగొండలో జరిగే గణేష్ నవరాత్రి వేడుకలు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ పున్న గణేష్ , గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పున్న సాయి కుమార్, పున్న విశ్వేశ్వర్, జ. లింగప్ప, జ. నాగరాజు, నారని బిక్షం, వనం యాదగిరి,వనం లక్ష్మీనర్సు,ఎల్ష్ణ, వెంకన్న, పున్న నరేశ్, చందు, సట్టు కిరణ్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఎ

పెరుగుతున్న విడాకుల సంస్కృతిపై కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు

సంబంధాలపై సోషల్ మీడియా ప్రభావం పెరిగిందన్న నటి

ఆన్‌లైన్ జీవితాలతో పోలికలు ఒత్తిడి పెంచుతున్నాయని వివరణ

సోషల్ మీడియాలో ప్రేమ, పెళ్లి అంతా పరిపూర్ణంగానే కనిపిస్తాయని వ్యాఖ్య

నిజ జీవిత సమస్యలు బయటకు కనిపించవని కాజల్ అభిప్రాయం

ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై నిఘా ఎక్కువైందని వ్యాఖ్య



దేశంలో విడాకులపై చర్చ పెరుగుతున్న వేళ నటి కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మారుతున్న సంబంధాలు, ప్రేమ, పెళ్లిపై నేటి తరం ఆలోచనా విధానంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్‌లో కనిపించే జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం వల్ల దంపతులపై అదనపు ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు.సోషల్ మీడియాలో ప్రేమ, పెళ్లి, ఆనందానికి సంబంధించిన ఎన్నో పోస్టులు కనిపిస్తుంటాయి. అయితే అవి ప్రతి ఒక్కరి నిజ జీవితాన్ని ప్రతిబింబించకపోవచ్చు. అందంగా కనిపించే ఫొటోలు, సంతోషకరమైన క్షణాలనే ఎక్కువగా పంచుకోవడంతో.. సంబంధాల్లో సమస్యలు, ఇబ్బందులు బయటకు కనిపించవు. దీంతో ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం మొదలవుతుందని కాజల్ పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై సోషల్ మీడియా నిఘా ఎక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి విషయంపైనా వచ్చే కామెంట్లు, విమర్శలు సంబంధాలపై ఒత్తిడిని పెంచుతున్నాయని తెలిపారు. ఈ ప్రభావం మహిళలపై మరింత ఎక్కువగా ఉంటుందని గతంలోనూ కాజల్ మాట్లాడారు.ప్రేమ సంబంధాల గురించి కాజల్ గతంలోనూ తన అభిప్రాయాలను వెల్లడించారు. జీవితంలో సంతోషం పూర్తిగా ప్రేమ లేదా వివాహ బంధంపైనే ఆధారపడకూడదని ఆమె చెప్పారు. భర్త గౌతమ్ కిచ్లుతో తన అనుబంధం గురించి కూడా పలు సందర్భాల్లో మాట్లాడారు.ప్రస్తుతం విడాకులపై ఆమె చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి. మారుతున్న అంచనాలు, సోషల్ మీడియా ప్రభావం, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ నేటి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయని కాజల్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528